కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించుకోవాలి

- పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి
- కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రం ప్రభుత్వం తీసుకుని వచ్చిన విద్యుత్ సంస్కరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సిపిఐ నగర కార్యదర్శి పి.రామకష్ణారెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షత జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌసే దేశాయి, రాష్ట్రకమిటీ సభ్యులు పి.నిర్మల, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మల్లికార్జున, ఎస్‌యు సిఐ జిల్లా నాయకులు నాగన్నలు మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీలు, సర్ చార్జీలు, ఇంధనం సర్దుబాటు చార్జీలు, కస్టమర్ చార్జిలు ఫిక్స్‌డ్‌చార్జీలు, విద్యుత్ సుంకం లాంటి వివిధ రకాల పేర్లతో చార్జీలను పెంచారన్నారు. నాలుగున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచి పెద్ద ఎత్తున బారాలు మోపిందని దీని కారణంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు. గతంలో వాడుకున్న కరెంటుకు తదుపరి భారం వేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్సీఎస్టీలకు వృత్తిదారులకు ఎక్కడ నివసిస్తున్న 200 యూనిట్ల వరకు ఉచిత రాయితీ ఇవ్వాలన్నారు. 200 యూనిట్లలోపు వాడే పేదలకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జిల్లా నాయకులు ఆనంద్ బాబు, గురుశేఖర్ సియచ్.సాయిబాబా, కె.సుదాకరప్ప, అర్.నరసిహులు, ఎం.విజయ్, అబ్దుల్ దేశాయ్, షరీఫ్, రామకృష్ణ, కె.ప్రభాకర్, మహ్మద్ రఫీ, నోమేశ్వరీ, బాస్కర్, శంకర్, మైమూద్, సిపిఐ నాయకులుకే జగన్నాథం, శ్రీనివాసరావు మహేష్ , బీసన్న, నాగరాజు, గిడ్డమ్మ, అమీనాబి పాల్గొన్నారు

విద్యారంగం పట్ల చిన్నచూపు తగదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా - విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడి
- గేట్లెక్కి లోపలికి వెళ్లేందుకు యత్నం - వినతిని స్వీకరించిన డిఆర్ఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహించారు. బుధవారం పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు గేట్లు ఎక్కి కలెక్టర్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ' విద్యారంగ వినాశకర 77, 108, 108 జిఒలను రద్దుచేయాలని , సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలని, ఉపాధ్యాయపోస్టులను భర్తీ చేయాలని, కరువు జిల్లాగా ప్రకటించి కరువు స్కాలర్‌షిప్ కింద ప్రతి విద్యార్థికి రూ.10 వేలు ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని' పెద్దపెట్టున నినాదాలు చేశారు. గేటుఎక్కి లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించగా పోలీసులు వెంటనే నిలువరించారు. కొంతసేపు పోలీసులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మధ్య తోపులాట కొనసాగింది. అక్కడికి వెంటనే డిఆర్ఒ మధుసూదన్ రావు చేరుకుని ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల నుండి వినతిపత్రం స్వీకరించారు. జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు రంగప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నామంటూ మరో వైపు ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. నాడు నేడు పేరుతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే సరిపోదని, ఉపాధ్యాయ పోస్టులకు కూడా భర్తీ చేయాలన్నారు. మూడేళ్లనుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం లేదని, మధ్యాహ్న భోజనం పెట్టకుండా , లెక్చరర్ పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కెవిఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హాస్టల్ నిర్మించుకునేందుకు హైకోర్టు ఆర్డర్ ఇచ్చినా దాన్ని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఉన్నత విద్యకు దూరం చేసే జిఒ 77 రద్దు చేయాలన్నారు. హానర్ డిగ్రీని రద్దు చేసి, డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో నిర్వహించి 3 సంవత్సరాల డిగ్రీ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అమ్మఒడి పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ డబ్బులు ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3000 లకు పెంచాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజ్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు రావలసిన సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 107, 108 లను రద్దు చేయాలన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి విద్యార్థులకు కరువు స్కాలర్ షిప్ కింద ప్రతి విద్యార్థికి రూ.10,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యారంగా అభివవృద్ధిలో భాగంగా జిల్లాలోని యూనివర్సిటీల అభివద్ధికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు సాయి, శీను, జిల్లా నాయకులు అమరు,రవి,మల్లేష్, భరత్, గౌస్, పోతురాజు, అంజి నగర నాయకులు యోగి, అబ్బాస్, అమీర్, గిరి, మూర్తి, మల్లేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా తదితరులు

కలెక్టరేట్ గేట్లను ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న నాయకులు

నిర్మాణానికి నోచలేదు..!

- కదలని మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణాలు
- ప్రారంభం కాని జగనన్న పాల వెల్లువ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

గ్రామీణ పాడి రైతుల నుంచి పాల సేకరణ పెంచేందుకు, పాడి రైతులను ప్రోత్సహించేందుకు జగనన్న పాలవెల్లువ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ఆర్భాటంగా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం ఇంత వరకు ప్రారంభం కాలేదు. భవనాల నిర్మాణాలు ముందుకు సాగలేదు..

జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 426 యూనిట్లను నెలకొల్పాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కర్నూలు జిల్లాలో 202 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బిఎంసియు), 192 ఆటోమేటిక్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (ఎఎంసియు) చేపట్టేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా 46 ఆటోమేటిక్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా ఇందులో కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో 224 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు గాను మూడు చోట్ల మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కొక్కటి రూ.16.70 లక్షలతో చేపట్టగా నంద్యాల మండలం మిట్నాల, బండి ఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం, గోస్పాడు మండలం కానాలపల్లిలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 426 బిఎంసియు, 192 ఎఎంసియు భవనాల్లో ఏడు మాత్రమే పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం పాడి రైతుల నుంచి సేకరించిన పాలను మూడు గంటల్లో సమగ్ర శీతలీకరణ కేంద్రాలకు తీసుకెళ్లాలి. ఇందుకుగాను బిఎంసియు భవనాలు అవసరం. వీటి కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 53 మండలాల్లో రెవెన్యూ శాఖ స్థల సేకరణ చేసింది. భవన నిర్మాణాలు ఆ స్థాయిలో జరగలేదు. పాల నాణ్యత పరీక్షించి వెన్న, కొవ్వు పదార్థాల శాతాన్ని నిర్ధారించేందుకు ఎఎంసియు భవనాలు అవసరం. భవనాల నిర్మాణాలు కానరావడం లేదు. మిల్క్ డెయిరీలను అమూల్ సంస్థకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా ఒప్పందంలో భాగంగా అమూల్ సంస్థకు అప్పగించి పాల సేకరణ చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అందులో భాగంగానే పాలవెల్లువ కింద బిఎంసియు, ఎఎంసియు కేంద్రాల ఏర్పాట్లు జరిగాయి. జిల్లాలో అమూల్ సంస్థతో ఎలాంటి లావాదేవీలూ లేవు. కేంద్రాల నిర్మాణాల ఊసే లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలి
- ఎస్ఇకి సిఐటియు ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి సంస్థలో విలీనం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు మీటర్ రీడర్స్ కర్నూలు జిల్లా అధ్యక్షులు రాజు, నంద్యాల జిల్లా అధ్యక్షులు రామకృష్ణ కోరారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు అనుబంధం ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు ఎస్ఇ ఎం.ఉమాపతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3800 మీటర్ రీడర్లు దాదాపు పది సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నామన్నారు. గతంలో స్పాట్ బిల్డింగ్ పని 24 రోజులు చేసేవారమని, పని దినాలను క్రమంగా కుదిస్తూ 15 రోజులు, 12 రోజులు, తొమ్మిది రోజులు చేశారు. ఇప్పటికే పని భారం ఎక్కువ అయిన తరుణంలో యాజమాన్యం వారు పని దినాలు ఇంకా కుదిస్తూ ఏడు రోజులకే బిల్లింగ్ పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. బిల్లింగ్ పని దినాలు కుదించడం వలన వచ్చే అరకోర వేతనాలు తగ్గిపోయి కుటుంబ పోషణ కూడా భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ఒత్తిడి వలన బిల్లింగ్ త్వరగా పూర్తి చేయాలనే క్రమంలో ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయన్నారు. మీటర్ రీడర్లకు నెల రోజులు పని కల్పించి కనీస వేతనం చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధికి ప్రమాదం ఏర్పడనుందని చెప్పారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న మీటర్ రీడర్లను సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు. వారిలో 1500 మంది వరకు ఐటిఐ, ఎలక్ట్రికల్ ట్రేడ్ డిప్లమాలు పూర్తి చేసిన వారు ఉన్నారని,వారిని షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని కోరారు. మీటర్ రీడర్లలో నాన్ టెక్నికల్‌గా ఉన్న వారికి వారి అర్హతను బట్టి సంస్థలోనే ఉపాధి కల్పించాలని కోరారు. కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లకు పీస్ రేట్ ప్రకారం వేతనం ఇవ్వడం లేదని, ఇపిఎఫ్ చెల్లించాల్సిన దానికన్నా తక్కువ చెల్లిస్తున్నారని, అందుకు సంబంధించిన స్లిప్పులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎస్ఇ వెంటనే స్పందించి రెండు జిల్లాల్లో ఉన్న ఎఇలతో మాట్లాడారు. ప్రతినెల విద్యుత్ మీటర్ రీడర్లతో సమావేశం నిర్వహించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని, అలా చేయక పోతే సంబంధిత అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఇని కలిసిన వారిలో మీటర్ రీడర్లు నాగేంద్ర, వేద వ్యాసముని, హుస్సేన్ బాష, వన్నూరు, కృష్ణలు ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

73 దరఖాస్తులకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సింగిల్ డెస్క్ పోర్టల్ క్లియరెన్స్ సమీక్షలో భాగంగా, వివిధ శాఖల అనుమతుల కోసం 86 దరఖాస్తులు రాగా 73 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆమోదముద్ర వేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ఏర్పాటు కోసం వివిధ శాఖల అనుమతుల పురోగతిపై సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా 86 టార్గెట్ కాగా అందులో 58 మంజూరయ్యాయని, వీటిలో 48 గ్రౌండ్ అయ్యాయని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తెలిపారు. ఏ ఏ బ్యాంకుల్లో దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయో, బ్యాంకుల వారీగా వాటి పూర్తి వివరాలతో సమాచారాన్ని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కు అందజేయాల్సిందిగా ఇండస్ట్రీస్ జిఎం ను కలెక్టర్ ఆదేశించారు.

నర్స్‌పై దాడి చేసిన వారిపై కేసు : సిఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న మేల్‌నర్స్‌పై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ సిఐ డి.మురళీధర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఐ కథనం మేరకు విటల్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌బాష కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎమర్జెన్సీ వార్డులో మంగళవారం పురుష నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో హర్ష అనే వ్యక్తి పేషెంట్‌తో పాటు మరో పది మందితో కలిసి చూపించుకోవడానికి అక్కడికి వచ్చారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న నర్స్ శేషమని కలుగజేసుకొని ఇద్దరు మాత్రమే ఉండి మిగిలిన వారు బయటకు వెళ్లాలని కోరారు. దీనికి హర్షతాను కూడా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నానని, నన్నే వెళ్ళమంటారా అంటూ దురుసుగా మాట్లాడుతుండగా మహమ్మద్ ఇర్ఫాన్‌బాష కలగజేసుకుని ఎందుకు అలా మాట్లాడుతున్నారని వారించబోయారు. ఇర్ఫాన్ భాషను దుర్భాషలాడుతూ తనతో వచ్చిన మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డారు. ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హర్ష తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆవాజ్ నాయకులు

ఆవాజ్ ఆధ్వర్యంలో మంచినీళ్ల ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనం పురస్కరించుకొని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్ విహార్ వద్ద మంచినీళ్ళ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఆవాజ్ నగర గౌరవ అధ్యక్షులు ఇస్మాయిల్, నగర కమిటీ అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్, నగర కార్యదర్శి మొహమ్మద్ షరీఫ్‌లు పాల్గొని ప్రసంగించారు. కర్నూలు ఉమ్మడి జిల్లా , నగరం గత కొన్ని ఏళ్లుగా మతసామరస్యానికి ప్రతీకగా ఆదర్శంగా ఉందనియ అన్నారు. కర్నూలు నగరంలో కుల,మత బేధాలు లేకుండా అందరి పండుగలను అందరూ కూడా, శాంతియుతంగా ,ఆనందా ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారన్నారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరం మరొకసారి మతసామరస్యం వెల్లివిరిసిందని అన్నారు. నగరంలో 2000కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారని, గణనాధుల నిమజ్జనానికి వచ్చిన కర్నూలు నగర ప్రజలకు సాధారణ స్వాగతం పలుకుతూ మంచినీళ్ల పాకెట్ల పంపిణీ చేశామన్నారు. ఆవాజ్ కమిటీ నగర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ నయీమ్, ఆవాజ్ కమిటీ నగర గౌరవ సలహాదారులు, షేక్ ఇలియాస్‌బాష, నగర సహాయ కార్యదర్శి చోటు భాయ్, అబ్దుల్ దేశాయ్, నగర సహాయ కార్యదర్శి షేక్షావలి, సయ్యద్ అహ్మద్ చోటు భాయ్, షేక్ బాషభాయ్ ,అబ్దుల్ గని, షేక్ మొహమ్మద్ హనీఫ్, మొహమ్మద్ సమీ, మొహమ్మద్ బాష, షేక్ అమీర్ హైదర్, మొహమ్మద్ ఆవేజ్ బాష పాల్గొన్నారు.

అంగన్వాడీల ద్వారా పోషకాహారం : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గర్భిణీ స్త్రీలు, పిల్లలకు అంగన్వాడీల ద్వారా పోషకాహారం అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి 'పోషణ్ మాసోత్సవం' (పోషన్ మా) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రతి 15 రోజులకు ఒకసారి మిల్లెట్ ఆధారిత వంటకాన్ని చేసి తల్లులకు చూపించాలన్నారు. అదే వంటకాన్ని పిల్లలకు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ ఇంఛార్జి పిడికి కలెక్టర్ సూచించారు. అదే విధంగా టేక్ హోమ్ రేషన్ ద్వారా ఇస్తున్న పదార్థాలతో రుచికరమైన మంచి వంటకాలను ఏ విధంగా తయారు చేసుకోవచ్చనే అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న ఫర్నీచర్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన ఫ్యాన్స్, లైట్ల వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఇంచార్జి ఐసిడిఎస్ పిడి.వెంకట లక్ష్మమ్మ, సిడిపిఒలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు తయారు చేసిన వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ఎస్‌టియు ఆధ్వర్యంలో జిపిఎస్ బిల్లు ప్రతులు దహనం

కర్నూలు కలెక్టరేట్ : అసెంబ్లీలో ఆమోదముద్ర వేసిన జిపిఎస్ బిల్లుకు సంబంధించిన ప్రతులను బుధవారం సాయంత్రం ఎస్‌టియు నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. కలెక్టరేట్ గాంధీ విగ్రహం సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న జిల్లా అధ్యక్షులు గోకారి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన జిపిఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యా యులకు ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి టికె.జనార్ధన్, నాయకులు గోవిందు, హనుమంతు, శేఖర్, పవిత్ర, శివ నాగిరెడ్డి, వెంకటరాముడు, ప్రసాదు, మురళి, నాగరాజు, హుస్సేన్ మియా, మూర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

జిజిహెచ్ సూపరిన్‌టెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్య శ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అందుకు ప్రతి ఒక్క హెచ్ఒడి సహకరించాలని సూపరిన్‌టెండెంట్ డాక్టర్ వి. వెంకట రంగారెడ్డి అన్నారు. బుధవారం జిజిహెచ్‌లోని ధనవంత్రి హాల్‌లో ఆరోగ్యశ్రీ పై అన్ని విభాగాల హెచ్ఒడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ వెంకటరంగా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ క్లెయిమ్ కేసెస్ అప్లోడింగ్‌లో టార్గెట్లను రీచ్ చేసిన డెర్మటాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ సర్జరీ మెడిసిన్ డిపార్టుమెంట్, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, విభాగాల హెచ్ఒ డీలను ప్రత్యేకంగా అభినందించారు. ఆరోగ్య శ్రీ అమలును మరింత పటిష్టంగా అమలు చేయాలని పలు విభాగాల హెచ్ఒడిలకు తెలిపారు. ఆరోగ్యశ్రీ కేసెస్ అప్లోడింగ్‌లో ఇతర డిపార్టుమెంట్ హెచ్ఒడి లు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాధిపతులతో ప్రతి మంగళవారం ఆరోగ్యశ్రీపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో ఆరోగ్యశ్రీ కేసులను ఇంకా ఇంక్రీజ్ చేయాలని, ఆరోగ్య శ్రీ ప్రియాత్రేషన్ ఫ్రోమ్ , కేషీట్స్‌లను పూర్తిగా ఫిలప్ చేసి సంబంధించిన ఆరోగ్యశ్రీ సిబ్బందికి ఇవ్వాలని హెచ్ఒడిలను ఆదేశించారు. ఆసుపత్రిలోని వివిధ హెచ్ఒడి, అసిస్టెంట్లను ఆరోగ్యశ్రీ కేసెస్‌లపై డిపార్ట్‌మెంట్ వారిగా సమీక్షించుకోవాలని తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఉన్న డేటా ఆపరేటర్స్‌కు ఆరోగ్యశ్రీ కేసెస్‌లను ప్రియాత్రేషన్ , డిశ్చార్జ్ అప్‌డేట్, క్లెయిమ్ కేసెస్, ఎప్పటికప్పుడే క్లియర్ చేయాలని డేటా ఆపరేటర్స్‌ను ఆదేశించారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, హెచ్ఒడిఎస్ డాక్టర్ఇక్బాల్ హుస్సేన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ మంజుల బాయ్, డాక్టర్ శ్రీలక్ష్మి బాయ్, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరిన్‌టెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి

నవ యుగకవి జాషువా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గుర్రం జాషువా నవయుగ కవి అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కెవిఆర్ మహిళా కళాశాలలో ఈరోజు జాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి డాక్టర్ రాదశ్రీ మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవులలో అభ్యుదయవాది వర్గ సంఘర్షణ ఆర్థిక వ్యత్యాసాల నిర్మూలన, దోపిడీ వర్గాలపై తిరుగుబాటు జాషువా కావ్యాలలో నిండుగా మెండుగా ఉన్నాయన్నారు. కుల వివక్షపై అందరికీ అర్థమయ్యేలా అనేక పద్యాలు కవిత్వాలు రాశారు. జాషువా సహజ కవిఅని పేర్కొన్నారు. చంద్రశేఖర్ కల్కూర, జెఎస్ఆర్‌కె.శర్మ, భాస్కర్ , గౌరెడ్డి హరిచంద్రరెడ్డి, తోపుదుర్తి వెంకటరావు,తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.ప్రమీల, డాక్టర్ డి.పార్వతి, డాక్టర్ బాశెట్టి లత, ఆర్‌జె.సుశీల కూడా మాట్లాడారు. అంతకుముందు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



యుటిఎఫ్ గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి -సి బెళగల్

యూటిఎఫ్ 50వ స్వర్ణోత్సవ గోడ పత్రికను జిల్లా కౌన్సిలర్లు ఎటి. తిమ్మన్న, ఎం అనుమంతు సమక్షంలో మండల అధ్యక్షులు కిశోర్, ఎస్.హనుమన్న లు బుధవారం ఘనంగా విడుదల చేశారు. ఐక్యత పోరాటాలకు పిలుపు గోడ పత్రికలని హక్కుల సాధనకు ఏకమవ్వాలని వారు యూటిఎఫ్ సభ్యులను కోరారు. సీనియర్ నాయకులు, రామదాసు, శు భానందరావు, భూపాల్ నాయుడు, మనోజ్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : అక్టోబర్ 1న విజయవాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాల వేడుకల గోడపత్రికను, జడ్‌పిహెచ్ఎస్ బాలికల కాంప్లెక్సు మీటింగ్ విరామ సమయములో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు యుఆర్ ఎ.రవి కుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్. మారెప్ప వారి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాలకు మండలం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

- మండల అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహాలను అరికట్టాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ కొండయ్య, వైద్యాధికారి జమీల్ అహ్మద్, ఎంఇఒ సావిత్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో మండలంలో పని చేస్తున్న అధికారులకు బాల్యవివాహాలు, జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలను అరికడదామని తహశీల్దార్ కార్యాలయం నుంచి భోగేశ్వర దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం అయ్యేలా ప్రతి అధికారీ కృషి చేయాలని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించే బాధ్యత గ్రామంలో పని చేస్తున్న ప్రతి అధికారికీ ఉందన్నారు. ముఖ్యంగా మహిళా సంరక్షకులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది ముఖ్య భూమికి పోషించాలని కోరారు. ఐఒఆర్‌డి నాగభూషణం, ఎఎస్ఐ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బాలనాగిరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి

- వైస్ ఎంపిపి బుజ్జిస్వామి

ప్రజాశక్తి - కౌతాళం

నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితోనే సాధ్యమని వైస్ ఎంపిపి బుజ్జి స్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. కౌతాళంలోని కామవరం రోడ్డులో ఉన్న కాలనీలకు 20 ఏళ్ల నుంచి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ పనులతో పాటు మండలంలోని సులేకేరి గ్రామంలో బనశంకరీ దేవి ఆలయం ముందు సిసి, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, బంటకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిసి, డ్రెయినేజీ, పొదలకుంట, మదిరే గ్రామాల్లో గ్రామ చావిడి నిర్మాణం వంటి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో పూర్తి చేస్తామని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న బుజ్జిస్వామి

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని సలకలకొండ, మదిరే, బల్లేకల్, నారాయణపురం గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి మార్కెట్ విలువ 5 శాతం ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వాటిని నాలా యాక్టు (NALA ACT) ప్రకారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసినట్లు తెలిపారు. మండల సర్వేయర్ రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి 6, 7వ వార్డు అధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములుతో కలిసి పట్టణంలోని 6, 7వ వార్డు అధ్యక్షులను ఎన్నుకున్నారు. బుధవారం టిడిపి సమావేశం నిర్వహించారు. టిడిపి 6వ వార్డు అధ్యక్షులుగా వైకె.శ్రీనివాసులు, 7వ వార్డు అధ్యక్షులుగా అంబేద్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. వార్డు ఇన్‌ఛార్జీలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా వార్డు ఇన్‌ఛార్జీలుగా ఎన్నికైన శ్రీనివాసులు, అంబేద్కర్ మాట్లాడాకరు. తమపై నమ్మకముంచి ఈ బాధ్యతలను అప్పగించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములుకు, బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. వార్డుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

రెగ్యులర్ ఉత్తీర్ణత అయ్యే అవకాశం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు దగ్గర్లోని చిప్పగిరి గవర్నమెంట్ కళాశాలల నుంచి రీఎన్‌రోల్ అయి రెగ్యులర్ విద్యార్థుల ప్రకారం తరగతులకు హాజరయి రెగ్యులర్ ఉత్తీర్ణత పొందే అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఫైన్ లేకుండా ఎగ్జామ్ ఫీజు కట్టడానికి చివరి తేదీ : 3.10.2023 అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేరుశనగ కొనుగోలు ప్రారంభించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మార్కెట్ యార్డులో గతవారం వేరుశనగ అమ్మకాలు (కొనుగోలు) నిలిచిపోయాయని, రైతులు రవాణా ఖర్చు ఎక్కువ పెట్టుకుని ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుకు వెళ్లి అమ్మకాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులు వేతనాల కోసం సమ్మె చేస్తే, మార్కెట్ యార్డులో వేరుశనగ అమ్మకాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. కమీషన్ ఏజెంట్లు కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి పంట పండించి, చేతికొచ్చిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్ యార్డులో కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్ యార్డులో కొనుగోలు ప్రారంభించాలని, మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఉచిత భోజన వసతి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుసంఘంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, మండల నాయకులు చిన్న తిక్కన్న, హనుమంతు రెడ్డి, రామాంజనేయులు, చిన్న పాల్గొన్నారు.

కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థుల నూతన ఆవిష్కరణలతో
'అటల్ టింకరింగ్ ఫెస్ట్'

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాల 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లో విద్యార్థులు తయారు చేసిన కొత్త ఆవిష్కరణలతో 'టింకరింగ్ ఫెస్ట్' నిర్వహించారు. బుధవారం ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎలక్ట్రానిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ సుభాష్ చంద్ర నాయుడు, ఎంఇఒ రామాంజనేయులు హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్, ఆటోమేటిక్ స్కూల్ బెల్, స్మార్ట్ స్టడీ లాంప్, ఒత్తిడి నుంచి విద్యుత్ తరంగాల తయారీ, స్పీడ్ బ్రేకర్ ఇండికేటర్, చంద్రయాన్-3, మోడల్ డిజిటల్ లాకర్, కవచ్ టెక్నాలజీ, సోలార్ స్మార్ట్ ఫ్యాన్, డిజిటల్ రేషన్ సిస్టం లాంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. మొదటి బహుమతి కవచ్ టెక్నాలజీ, రెండో బహుమతి డిజిటల్ లాకర్, మూడో బహుమతి ఆటోమేటిక్ స్ట్రీట్ లైటు సాధించాయి. వాటిని రూపొందించిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న

ప్రజల ఆశీస్సులతో..
చంద్రబాబు బయటికొస్తారు

ఆదోనిలో సంతకం చేస్తున్న మీనాక్షి నాయుడు

మంత్రాలయంలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

వైసిపి ఎన్ని కుట్రలు చేసినా టిడిపి అధినేత చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో జైలు నుంచి బయటకొస్తారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి దోపిడీ పాలన కొనసాగిస్తోందని తెలిపారు. వైసిపి అవినీతి, అక్రమాలను చంద్రబాబు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోనే జీర్ణించుకోలేక అక్రమ కేసులతో చంద్రబాబును జైలులో పెట్టించారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబుకు అందరూ అండగా నిలిచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 'బాబు కోసం.. మేము సైతం' అంటూ ఆర్యవైశ్య సోదరులు సూర్య మనోహర్ రావు, నేరెళ్ల సీనయ్య, తోర్నాల అయ్యప్ప, ఇల్లూరు మనోహర్, ఎక్కల కిరణ్, మురారి నితిన్, భూపాలం నారాయణ మూర్తి, జయం వెంకటేష్, టిజి.రాజేష్, వైష్ణవ కుమార్ నేరెళ్ల దీక్షలకు సంఘీభావం తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, టిడిపి నాయకులు బసాపురం రామస్వామి, తిమ్మప్ప, శివప్ప, జయకుమార్, సాయిబాబు, వీరేష్, బసాపురం వెంకటేష్, చాగి మల్లికార్జున రెడ్డి దీక్షలో కూర్చున్న వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు.

అలాగే చంద్రబాబుకు మద్దుతుగా 16వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు మాన్వి దేవేంద్రప్ప, భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... రానున్న రోజుల్లో టిడిపిదే అధికారమని ధీమా వక్తం చేశారు. సోమశేఖర్ రెడ్డి, షేక్షావలీ పాల్గొన్నారు. **ఆలూరు**లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి నాయీ బ్రాహ్మణులు, రజక సంఘం నాయకులు, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి అశోక్, నాయీ బ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్ వీరేశ్, మాజీ డైరెక్టర్ గూళ్యం రామాంజినేయులు, హోళగుంద వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, చాకలి వీరేశ్, గుడుదప్పలు దీక్షలు చేపట్టారు. టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ, శేషగిరి, సర్పంచి ఎల్లప్ప, జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కొమ్ము రామాంజి, సోమ శేఖర్ నాయుడు, నాగరాజు, కిషోర్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, దేవేంద్రప్ప, ఆంజనేయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సోమప్ప సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన దీక్షలు 15వ రోజుకు చేరాయి. డాక్టర్ బీవీ, టిడిపి డోన్ ఇన్‌ఛార్జీ ధర్మవరం సుబ్బారెడ్డిలు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. అలాగే పట్టణంలోని 1, 2వ వార్డుల్లో డాక్టర్ బీవీ, ధర్మవరం సుబ్బారెడ్డితో కలిసి 'చంద్రబాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో చేపట్టిన రిలే దీక్షల్లో టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి పరిశీలకులు శివబాలతో కలిసి దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి నాగశయన స్వామి, నాయకులు అశోక్ రెడ్డి, అడివప్ప గౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, మారెప్ప పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిలుకలడోన గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. తాగు, సాగు నీరు లేక, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని తిక్కారెడ్డి తెలిపారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, నాయకులు హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీవీ

ఆలూరులో మాట్లాడుతున్న సుజాతమ్మ

పొలం సమస్య పరిష్కారం కాలేదని...

- పెట్రోల్ పోసుకొని యువతి ఆత్మహత్యాయత్నం

- అపస్మారక స్థితిలో ఉన్న యువతిని ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - కోసిగి

పొలం సమస్య పరిష్కారం కాలేదని, నాలుగేళ్ల నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి అలిసిపోయిన యువతి బుధవారం తహశీల్దార్ కార్యాలయంలోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె వివరాల మేరకు... మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన సరస్వతికి, ఆమె తమ్ముళ్లకు పెద్దల నుంచి సర్వే నెంబర్ 180 సిలో 2 ఎకరాల 90 సెంట్ల భూమి సంక్రమించింది. ప్రస్తుతం తమకు 2 ఎకరాల 31 సెంట్లు భూమి మాత్రమే ఉందని, ఇంకా 59 సెంట్లు భూమి రావాల్సి ఉందని సర్వే చేయించి తమకు 59 సెంట్ల భూమి ఇప్పించాలని తహశీల్దార్‌కు విన్నవించారు. తహశీల్దార్ రుద్రగౌడ్ స్పందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందరూ చూస్తుండగానే పెట్రోల్ పోసుకొని సరస్వతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమీపంలో ఉన్న వారు పెట్రోల్ డబ్బా లాక్కొని ఆమెను అడ్డుకున్నారు. కొంతసేపటికి తహశీల్దార్ కార్యాలయంలోనే స్పృహ కోల్పోయిన సరస్వతిని బంధువులు కోసిగి ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో కార్యాలయానికి వచ్చిన వారు, సిబ్బంది భయబ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. తహశీల్దార్ రుద్రగౌడ్‌ను వివరణ కోరగా... వందగల్లు గ్రామంలో 180 సి సర్వే నెంబర్‌లో 108 ఎకరాల 80 సెంట్ల బంజరు భూమి ఉందని తెలిపారు. ఇందులో సరస్వతి, వారి అన్నదమ్ములు 20 ఏళ్లుగా 2 ఎకరాల 31 సెంట్ల భూమిలో సాగులో ఉన్నారని చెప్పారు. గ్రామంలో జరిగిన రీ సర్వేలో కూడా చూపించినట్లు తెలిపారు. పక్క పొలంలో సాగులో ఉన్న మజ్జిగ కోసిగమ్మ సర్వే నెంబర్ 187గా ఉండడంతో ఆమె పొలం వేరే దగ్గర ఉంటుందని, పక్కన పొలంలో తమకు 59 సెంట్లు భూమి ఇప్పించాలని సరస్వతి తహశీల్దార్ కార్యాలయంలో వినతి ఇచ్చినట్లు చెప్పారు. మండల సర్వేయర్‌తో కూడా సర్వే చేయించి వారి భూమి వారికి చూపించామని, ఇంకేమైనా ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లాలని తెలిపినట్లు వివరించారు. సరస్వతి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ తమను భయపెట్టడానికి ప్రయస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని, ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న యువతి

80 శాతం సబ్సిడీతో శనగలు పంపిణీ చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

రబీలో రైతులు సాగు చేసే పప్పు శనగ విత్తనాలను 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి అధ్యక్షతన వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేయడం సరికాదని, 80 శాతం సబ్సిడీతో ఎకరాకు 50 కిలోల చొప్పున ఐదెకరాలకు 250 కిలోల శనగ విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. సకాలంలో రైతులకు విత్తనాలు అందించాలని తెలిపారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ అధికారి నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, నాయకులు చిన్న ఈరన్న, రైతులు కేశవ రెడ్డి, మురళీ రెడ్డి పాల్గొన్నారు.

'రామకృష్ణపై దాడి చేసిన పిసిలను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి -పెద్దకడబూరు

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణపై దాడి చేసిన కానిస్టేబుల్ నాగరాజు, పరమేశ్వర్‌ను సస్పెండ్ చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం రైతుసంఘం జిల్లా నాయకులు పరమేష్, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, సిఐటియు నాయకులు ఈరన్న మాట్లాడారు. రామకృష్ణపై చేయి చేసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగరాజు, పరమేశ్వర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వార్డు పట్ల నిర్లక్ష్యం వద్దు...

- వైసిపి కౌన్సిలర్ ప్రశ్నలతో సమావేశాన్ని ముగించిన చైర్మన్

ప్రజాశక్తి - ఆదోని

కౌన్సిలర్లుగా ఎన్నికై ఏళ్ల గడిచినా కనీసం ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని కౌన్సిలర్లు అధికారులు తీరుపై మండిపడ్డారు. వార్డులోని సమస్యలను పరిష్కరించకపోతే ఎలా అని, ఏమని సమాధానం చెప్పాలని, వారి వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లాలని, స్థానికులు రోజూ ఇంటికొచ్చి నిలదీస్తున్నారని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మహిళా కౌన్సిలర్లు పద్మ, పార్వతీలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం చైర్మన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. వైసిపికి చెందిన 30వ వార్డు కౌన్సిలర్ జి.పద్మ మాట్లాడుతూ... తన వార్డులో మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరై ఏళ్ల గడుస్తున్నా పనులు చేయకపోవడం ఏమిటని చైర్మన్‌ను ప్రశ్నించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వంక పొంగి పొర్లి వర్షపు నీరు, వంద్రు మట్టి నీరు సమీప ఇళ్లలోకి చేరాయన్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వచ్చి తమను నిలదీస్తున్నారని, వారికేమని సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలు మాత్రం పని చేసే వారికే ఓట్లు వేస్తామని చెబుతున్నారని, ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లాలని కౌన్సిలర్ పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తనకు సమాధానం చెప్పాలని చైర్మన్‌ను నిలదీశారు. సదరు కౌన్సిలర్ భర్త, వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ ఎండి, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ యాదవ్ ఇటీవల వైసిపికి రాజీనామా చేసి బయటికి వెళ్లారు. ఆయన భార్య పద్మ సమావేశంలో మాట్లాడుతున్న సమయంలో వైసిపి కౌన్సిలర్లు కొంతమంది బయటకు వెళ్లిపోవడం, మరి కొంతమంది సమావేశాన్ని ముగించమని చైర్మన్‌కు చెప్పడం, చైర్మన్ ఆమెకు పూర్తిస్థాయిలో సమాధానం చెప్పకుండానే సమావేశం ముగించారు. తన భర్త రమేష్ యాదవ్ వార్డులో సొంత నిధులతో వీధిలైట్లు వేయించారని, ఇతర అనేక పనులు చేశారని, కేవలం అభివృద్ధి పనులు చేయడం లేదని బయటికి వెళ్లారని, వార్డులో అన్ని అభివృద్ధి పనులు చేస్తే తన భర్తను తిరిగి తాను వైసిపిలోకి తీసుకొస్తానని కౌన్సిలర్ పద్మ విలేకరులతో తెలిపారు. కరోనా సమయంలో తాము చేసిన పనులకు బిల్లులు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. అలాగే 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... తన వార్డులో అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని, ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఎఇ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... నిధులు మంజూరయ్యాయని, కొన్ని రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో ఇప్పటికే సిగ్నల్ లైటింగ్ వ్యవస్థ కోసం మున్సిపాలిటీ నుంచి రూ.25 లక్షలు ఖర్చు చేశామని, పట్టణంలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థ కొన్నేళ్లుగా పని చేయడం లేదని, మళ్లీ కొత్తగా సిగ్నల్ వ్యవస్థ కోసం రూ.18 లక్షలు మంజూరు చేయడం ఏమిటని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ ఎందుకు పని చేయడం లేదని, వాటిపై విచారించాలని డిమాండ్ చేశారు. ఇక నుంచి కొత్తగా ఏర్పాటు చేసే సిగ్నల్ వ్యవస్థను మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామని, ఎలాంటి సమస్యా ఉండదని మున్సిపల్ ఎఇ రాధాకృష్ణ సమాధానం ఇచ్చారు. మున్సిపాలిటీ నిధులతో ప్రభుత్వ మహిళల ఆస్పత్రిలో భవనాల తొలగింపునకు నిధులు కేటాయించడం ఏమిటని, అక్కడ ప్రత్యేకంగా నిధులు మంజూరు కావా అని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే పట్టణంలో ఎక్కడైనా సమస్య ఉంటే నిధులు ఖర్చు చేసి పని చేయాల్సి ఉంటుందని కమిషనర్ రఘునాథ్ రెడ్డి సమాధానం చెప్పారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న నీటి గుమ్మిలకు పైన మూతలు ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్ బాలాజీ సూచించారు.

ఎస్ఎస్ ట్యాంకుపై జరగని చర్చ

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఇటీవల కుంగిపోయింది. సకాలంలో మరమ్మతులు చేయకపోతే నీటి నిల్వకు అవకాశం ఉండదు. వేసవిలో ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కోక తప్పదు. అలాంటి సమస్య ఉన్నప్పటికీ కనీసం కౌన్సిలర్లు చర్చ జరపకుండానే సమావేశం ముగించారు. అజెండా చదివి నామమాత్రంగానే సమావేశం ముగిసింది. వైస్ ఛైర్మన్లు ఎంఎంజి.గౌస్, నరసింహులు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ డిఇ రాజు నాయక్, చలపతి రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, మెప్మా అధికారి షమీమా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజినీర్లు కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, చంద్ర, కౌన్సిలర్లు చలపతి, చిన్న, సందీప్ రెడ్డి, ఫయాజ్, ఉస్మాన్, ఇంతియాజ్, లోకేశ్వరి, లక్ష్మీదేవి, ఇందు, కీర్తన, శాంతి, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క ఉన్నారు.

సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ పద్మ

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.10/2023

కురువ మద్దిలేటి. ...వాది

-ఎదురి-

జి.గోపినాథ్‌రావు వగైరా. ...ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమన్లు

కె.సుధారాణి భర్త డి.రాఘవ్, ఇంటి.నెం.18-97, కొత్తపేట, కోడుమూరు గ్రామం, కర్నూలు జిల్లా.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదుల పైన దావా షెడ్యూలు దాఖలా అస్తి యొక్క మిగతా విక్రయ మొత్తము రూ.66,25,000/-లు తీసుకొని దావాషెడ్యూలు ఆస్తిని రిజిష్టరు చేయులాగున అట్లు లేని యడల వాది, ప్రతివాదులకిచ్చిన అడ్వాన్సు మొత్తం రూ.22,00,000/-లు అగ్రిమెంటు తేది నుండి అనగా 20-11-2021 తేది నుండి 18% ప్రకారం వాపసు ఇచ్చులాగున,మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 2వ ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయ దమైనది.

షెడ్యూలు: 1వ ప్రతివాది ఎ.షెడ్యూలు ఆస్తి వివరము.

కర్నూలు జిల్లా,కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే నెం.411/బి4,యక.2-59 సెంట్లు.

2వ ప్రతివాది, బి.షెడ్యూలు ఆస్తి వివరము.

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే నెం.411/బి4,యక.1-70 సెంట్లు.
మొత్తం యక.4.29 సెంట్లు
తూర్పు : వంక మరియు తెలుగు యర్రమల భూమి,
పడమర : సుధాకర్‌రెడ్డి భూమి,
ఉత్తరం : సుధాకర్‌రెడ్డి మరియు పెద్దటేకూరు లక్ష్మమ్మ భూమి.
దక్షిణం : బి.నారాయణరెడ్డి భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్‌బాషా,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.290/2019

యం.సునీత. ...వాది

-వర్సెస్-

పురవాకిటి శ్రీనివాసరెడ్డి తండ్రి పి.క్రిష్ణరెడ్డి, ఇంటి.నెం.4-22-10, బాలాజీ నగర్, స్టాంటన్‌పురం గ్రామం, కర్నూలు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పైనెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీనుండి దావా మొత్తం రూ.13,31,920/-లు ఇందుపైన ముందు వడ్డీ, మరియు కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 02-11-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్‌బాషా,
వాది పరం న్యాయవాది, కర్నూలు.

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
I.A.NO. 1047/2023 IN
M.V.O.P. NO. 50/2020

H. Ramudu .... Petitioner
VS
K. Rama Naidu .... Respondent

NOTICE TO THE RESPONDENT

To
Respondent
K. Rama Naidu S/O K. Kistaiah, Major, Hindu, Driver cum Owner of the vehicle, H.No. 21/131-A, Ramachandrapuram Vilage, Pathikonda Mandal, Kurnool dist.

Where as the above named petitioner filed petition Under Section 166 (1) (a) of Motor Vehicles Act for claiming compensation against you for the injuries sustained by the petitioner. Hence you are hereby required to appear before this court on **2.11.2023 at 10.30 AM** in person or through an advocate and answer the said claim petition, otherwise the matter will be decided exparte.

(By Court Order)

V. Lakshmaiah,
Advocate,
Yemmiganur,
Kurnool Dist. A.P.

IN THE COURT OF THE MOTOR ACCIENTS CLAIMS TRIBUNAL CUM II ADDITIONAL DISTRICT JUDGE, KURNOOL AT ADONI.
M.V.O.P. 45/2021

Between: -
M.Anand ... Petitioner
Vs
1) B.Gopal
2) The Chairman Cum Managing Director, A.P.S.R.T.C., Amaravathi, Andhra Pradesh.
..... Respondants

Notice to Respondant No. 1

R1- B.Gopal S/o Not Known, Hindu, aged about 45 years, Driver of the A.P.S.R.T.C. Bus Bearing No. AAZ 4049 (DGT), resident of A.P.S.R.T.C., Adoni Depot, Adoni

Whereas the above named Petitioner filed the above case for compensation against you and another and the above case is posted for your appearance on 05-10-2023.

You are hereby directed to appear in person or through your Advocate on **05-10-2023 at 10.30 a.m.** before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence.

G.C.RANGANNA,
G.RAJESH,
Advocates for Petitioner.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియస్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.113/2022 ఇన్ ఓ.యస్.నెం.240/2022

షేక్ నూర్జహాన్ బేగం. ...అర్జీదారు/వాది

-ఎదురి-

ఆర్.గోపాల్ మరియు వగైరా.
...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

3వ రెస్పాండెంటుకు నోటీసులు

శ్రీమతి జి.సరోజమ్మ భర్త లేటు శాంతమూర్తి,
గృహిణి,గీతానగర్, బళ్ళారి చౌరస్తా,
కర్నూలు సిటి.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదులపైన దావా షెడ్యూలు దాఖలా అస్తి తన భర్త అయిన షేక్ షఫివుల్లా అలియాస్ షేక్. మహమ్మద్ అలీ షఫీవుల్లాకు చెందిన 7 వ నెంబరు ఖాళీ ప్లాటులోకి ప్రతివాదులు అన్యక్రాంతముగా వస్తున్నారని వాది ప్రతివాదులపైన పైతెలిపిన కోర్టులో దావా దాఖలు చేసినది. అలాగే దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో రెస్పాండెంట్లు/ ప్రతివాదులుగాని వారి మనుష్యులుగాని ప్రవేశించకుండా మరియు ప్రతివాదులు/రెస్పాండెంట్లు ఎలాంటి అన్యాక్రాంతములు చేయకుండా దావా తీర్మానం అయ్యేంత వరకు ఇంటిరిమ్ ఇంజక్షన్ ఉత్తర్వులు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాది. ఇందులో 3వ రెంస్పాండెంటు/ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 12-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:

కర్నూలు జిల్లా,కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,కల్లూరు మండలం,గీతానగర్,కర్నూలు కార్పోరేషన్ పరిధిలోని సర్వే నెం.303/1, ప్లాటు నెం.7, మొత్తం విస్తీర్ణం :166.66 స్కయర్ యార్డ్సు,
తూర్పు : ప్లాటు నెం.13
పడమర : 30 అడుగుల రోడ్డు
ఉత్తరం : సర్వే నెం.300 గల భూమి
దక్షిణం : ఇదే సర్వే నెంబరులోని ప్లాటు.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యం.ఆర్.క్రిష్ణ,
యస్.పాపన్న
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియస్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.240/2022

షేక్ నూర్జహాన్ బేగం. ...వాది

-ఎదురి-

ఆర్.గోపాల్ మరియు వగైరా. ...ప్రతివాదులు

3వ ప్రతివాదికి దావా సమన్లు

శ్రీమతి జి.సరోజమ్మ భర్త లేటు శాంతమూర్తి,
గృహిణి, గీతానగర్, బళ్ళారి చౌరస్తా,
కర్నూలు సిటి.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదులపైన దావా షెడ్యూలు దాఖలా అస్తి తన భర్త అయిన షేక్ షఫివుల్లా అలియాస్ షేక్. మహమ్మద్ అలీ షఫీవుల్లాకు చెందిన 7 వ నెంబరు ఖాళీ ప్లాటులోకి ప్రతివాదులు అన్యక్రాంతముగా వస్తున్నారని వాది ప్రతివాదులపైన పైతెలిపిన కోర్టులో దావా దాఖలు చేసినది. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 12-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:

కర్నూలు జిల్లా,కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,కల్లూరు మండలం,గీతానగర్,కర్నూలు కార్పోరేషన్ పరిధిలోని సర్వే నెం.303/1, ప్లాటు నెం.7, మొత్తం విస్తీర్ణం :166.66 స్కయర్ యార్డ్సు,
తూర్పు : ప్లాటు నెం.13
పడమర : 30 అడుగుల రోడ్డు
ఉత్తరం : సర్వే నెం.300 గల భూమి
దక్షిణం : ఇదే సర్వే నెంబరులోని ప్లాటు.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యం.ఆర్.క్రిష్ణ,
యస్.పాపన్న
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.170/2023 ఇన్ ఓ.యస్.నెం.10/2023

కురువ మద్దిలేటి. ...అర్జీదారు/వాది

-ఎదురి-

జి.గోపినాథ్‌రావు వగైరా. ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

2 రెస్పాండెంటు (ప్రతివాది)కి ఆర్డర్ 39 రూల్ 1 మరియు 2, సి.పి.సి ప్రకారం నోటీసులు

కె.సుధారాణి భర్త డి.రాఘవ్, ఇంటి.నెం.18-97, కొత్తపేట, కోడుమూరు గ్రామం, కర్నూలు జిల్లా.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదులపైన దావా షెడ్యూలు దాఖలా అస్తి యొక్క మిగతా విక్రయ మొత్తము రూ.66,25,000/-లు తీసుకొని దావాషెడ్యూలు ఆస్తిని రిజిష్టరు చేయులాగున అట్లు లేని యడల వాది, ప్రతివాదులకిచ్చిన అడ్వాన్సు మొత్తం రూ.22,00,000/-లు అగ్రిమెంటు తేది నుండి అనగా 20-11-2021 తేది నుండి 18% ప్రకారం వాపసు ఇచ్చులాగున,మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేస్తూ, మరియు దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో రెస్పాండెంట్లు/ ప్రతివాదులుగాని వారి మనుష్యులుగాని ప్రవేశించకుండా మరియు ప్రతివాదులు/ రెస్పాండెంట్లు ఎలాంటి అన్యాక్రాంతములు చేయకుండా దావా తీర్మానం అయ్యేంత వరకు ఇంటిరిమ్ ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 2వ రెస్పాండెంటు/2వ ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: 1వ ప్రతివాది ఎ.షెడ్యూలు ఆస్తి వివరము.

కర్నూలు జిల్లా,కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,కల్లూరు మండలం,బస్తిపాడు గ్రామం,
సర్వే నెం.411/బి4,యక.2-59 సెంట్లు.

2వ ప్రతివాది, బి.షెడ్యూలు ఆస్తి వివరము.

కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా,
కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం,
సర్వే నెం.411/బి4,యక.1-70 సెంట్లు.
మొత్తం యక.4.29 సెంట్లు
తూర్పు : వంక మరియు తెలుగు యర్రమల భూమి,
పడమర : సుధాకర్‌రెడ్డి భూమి,
ఉత్తరం : సుధాకర్‌రెడ్డి మరియు పెద్దటేకూరు లక్ష్మమ్మ భూమి.
దక్షిణం : బి.నారాయణరెడ్డి భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

యస్.చాంద్‌బాషా
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యుత్ భారాలపై

నిరసనాగ్రహం

- నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా
- పెంచిన ఛార్జీలను తగ్గించాలి
- లేనిపక్షంలో బషీర్ బాగ్ ఉద్యమ స్ఫూర్తితో మరో పోరాటం
- సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.రమేష్ కుమార్, ఎన్.రంగనాయుడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నంద్యాలలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ, ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని నినాదాలు చేశారు. ప్రజా ఉద్యమాలపై పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించకపోతే 2000 సంవత్సరంలో జరిగిన బషీర్ బాగ్ ఉద్యమం స్ఫూర్తితో మరో పోరాటం చేపట్టాల్సి వస్తుందని, తద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు నంద్యాలలో బుధవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలతో స్థానిక నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు పి.నరసింహులు, కె.ప్రసాద్‌లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.రమేష్ కుమార్, ఎన్.రంగనాయుడు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలపై పెంచిన విద్యుత్ భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలపై విద్యుత్ చార్జీలు ట్రూ అప్ పేరుతో 50 వేల కోట్ల రూపాయలు భారాలు మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్రంలోని ప్రధాని మోడీకి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టుపెట్టి విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తున్నారని తెలిపారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడమే కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించి మరో ఉరితాడు వేయాలనే దుర్మార్గమైన ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ఉద్యమాలను నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులపై పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.నాగరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.సుంకయ్య, కె.శ్రీనివాసులు, భాస్కర్, సిపిఎం జిల్లా నాయకులు మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.లక్ష్మణ్, నాయకులు రామరాజు, కెఎండి గౌస్, వెంకట్ లింగం, రామచంద్రుడు, బాల వెంకట్, మార్క్, డివైఎఫ్ఐ నాయకులు ఓ.లక్ష్మణ్, శివ, జిలాని బాషా, మహిళా సమాఖ్య నాయకురాళ్లు సుగుణమ్మ, నారాయణమ్మ, బీబీ, సిపిఐ నాయకులు ధనుంజయ, నాగరాముడు, డి.శ్రీనివాసులు, సోమన్న, భూమిని శ్రీనివాసులు, నారాయణ, సామేలు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

స్కూల్ బస్సుకు

తప్పిన పెను ప్రమాదం

- గేదెలను తప్పించబోయి అవుకు రిజర్వాయర్‌లోకి దూసుకుపోయిన బస్సు
- మట్టి కుప్పలో ఆగిపోవడంతో ఊపిరి పీల్చుకున్న డ్రైవర్, విద్యార్థులు
- ప్రమాద సమయంలో బస్సులో 14 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలోని కెబిఎన్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన మినీ స్కూల్ బస్సుకు బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. బస్సు అవుకు రిజర్వాయర్‌లోకి దూసుకుపోయిన సంఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 14 మంది విద్యార్థులు భయాందోళనతో కేకలు వేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కెబిఎన్ పాఠశాలకు చెందిన మినీ బస్సు 14 మంది విద్యార్థులను సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత చెర్లోపల్లి గ్రామంలో వదిలి పెట్టేందుకు బయల్దేరింది. మార్గమధ్యలో అవుకు రిజర్వాయర్ వద్దకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి డ్రైవర్ అదుపుతప్పి బస్సును ఒక్కసారిగా రిజర్వాయర్‌లోకి తిప్పడంతో దూసుకుపోయింది. అక్కడ ఉన్న మట్టి కుప్పలలో టైర్లు కూరుకుని బస్సు ముందుకు వెళ్లలేక ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 14 మంది విద్యార్థులు భయాందోళనతో కేకలు వేశారు. కానీ బస్సు మట్టి కుప్పల వలన ఆగిపోవడంతో డ్రైవర్, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు కూడా అడుగంటడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రిజర్వాయరులో నీళ్లు నిండుగా ఉంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. స్కూల్ బస్సు ప్రమాదం విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని తమ పిల్లలను తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోడంతో స్థానికులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

స్పందన కార్యక్రమానికి విశేష స్పందన

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో ఎంపిడిఒ శివరామయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, జడ్పీ సీఈవో సుబ్బారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య, డోన్ ఆర్డిఓ వెంకట రెడ్డితోపాటు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మొత్తం 912 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో తమకు ఇంటి స్థలాలు కావాలని వినతి పత్రాలు ఇచ్చారు. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఉన్నాయని, పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా రావడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూల రాజు ఆధ్వర్యంలో జెసికి వినతిపత్రం ఇచ్చారు. ఇల్లూరు కొత్తపేట జగనన్న కాలనీలో రోడ్లు వేయాలని కాలనీ వాసులు వినతి అందజేశారు. వికలాంగుల సమస్యలపై జెసికి వినతిపత్రం ఇవ్వడంతో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఎవరు రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడి ఫాతిమా, సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్‌లకు మెమోలు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డీఇ ఉమాకాంతరెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఎంఈఓ స్వరూప, విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, గర్జప్ప, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- ఆర్‌డిఓ శ్రీనివాస్

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల ఆర్‌డిఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను, మండల పరిషత్ ప్రధాన ప్రాథమిక పాఠశాలను పరిశీలించామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయిలో రెండు, అర్బన్ స్థాయిలో నాలుగు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లకు రెండు కిలో మీటర్ల లోపు పోలింగ్ కేంద్రాలు ఉండేటట్లు కృషి చేస్తామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2.25 లక్షల మంది ఓటర్లుండగా అందులో 1.13 లక్షల మంది స్త్రీలు, 1.12 లక్షల మంది పురుషులు ఉన్నారన్నారు. మండలంలో 54 మంది బిఎల్‌ఓలతో చనిపోయిన ఓటర్లను, బోగస్ ఓటర్లను సర్వే చేసి ఫారం–7 ద్వారా తొలగిస్తామన్నారు. బోగస్ ఓటర్ల తొలగింపుకు ఈ నెల 27 చివరి తేదీ అన్నారు. మండలంలోని ఆరు గ్రామాలలో భూ రీసర్వే పూర్తైందన్నారు. ఈ గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్, వాల్యుయేషన్, 13వ నోటిఫికేషన్ క్లియరెన్సు రావడంతో చాగలమర్రి, మల్లెవేముల, పెద్దవంగలి, చిన్నవంగలి, వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలలో హద్దురాళ్ళ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో డి.వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలలో పనులు ఇంకా జరుగుతూ ఉన్నాయన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటయ్య, బిఎల్‌ఓలు ధరణి, ప్రసన్న, పర్వీన్, నరేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ

మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సేతురామన్

రాష్ట్ర ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రంగా అహోబిలం

- పర్యాటక మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా అవార్డు అందుకున్న సేతురామన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలం క్షేత్రం రాష్ట్ర ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రంగా ఎంపికైంది. ఈ సందర్భంగా అహోబిల మఠం కమ్యూనికేషన్ అధికారి కిడాంబి సేతురామన్ ఎపి పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా బుధవారం విజయవాడలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సేతురామన్ మాట్లాడుతూ అహోబిల మఠం పీఠాధిపతి వారి ఆశీస్సులతో ఈ అవార్డు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన ఐఎఎస్‌లు కన్నబాబు, నిశాంతితో పాటు శ్రీమల్ రెడ్డి, డిటిఓ సత్యనారాయణ, అసిస్టెంట్ డిటిఓ గోపాల్, నంద్యాల ఇంటెక్ చాప్టర్ కన్వీనర్ శివకుమార్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వంచే అందుకున్న అవార్డు ప్రహ్లాద వరద స్వామికి సమర్పిస్తామన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలకు నమోదు చేసుకోండి

- మండల వ్యవసాయాధికారి జ్యోతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలోని రైతులందరూ నేటి నుండి సబ్సిడీ విత్తనాలకు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 1800 క్వింటాళ్ల శనగ విత్తనాలను కేటాయించినట్లు చెప్పారు. 40 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు క్వింటాకు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **అవుకు :** సబ్సిడీ శనగ విత్తనాల కోసం ఆయా సచివాలయాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను క్వింటా రూ. 4,800లతో ప్రభుత్వం అందిస్తోందని, ఈ అవకాశాన్ని మండలంలోనిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎఓ జ్యోతి

వడ్డీ లేని రుణాలలో రూ. 6.58 లక్షలు అవినీతి

ప్రజాశక్తి - రుద్రవరం

పొదుపు ఉన్నతి ఎస్సీ ఎస్టీ పొదుపు మహిళలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలలో రూ.6 లక్షల 58 వేలు అవినీతి జరిగినట్లు విచారణలో వెల్లడైందని రాష్ట్ర ఉన్నతి ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని ఒక క్లస్టర్లో 2020, 21, 22 ఆర్థిక సంవత్సరాలకు గాను వడ్డీ లేని రుణాలను ఎస్సీ ఎస్టీ పొదుపు మహిళలకు అందించిన రుణాలపై లోకాయుక్త కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ఉన్నతి అధికారులు బుధవారం మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ పొదుపు మహిళలకు వడ్డీ లేని రుణాలను 383 మందికి రూ. 1 కోటి 76 లక్షల 30 వేల 250 మంజూరు చేసినట్లు చెప్పారు. 1 కోటి 11 లక్షల 39 వేల 82 రూపాయలను రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఆన్లైన్లో, ఆఫ్‌లైన్‌లో పొందు పరచకుండా ఉన్నది 6 లక్షల 58 వేల రూపాయలను గుర్తించినట్లు తెలిపారు. విచారణలో తేలిన వాస్తవాలను నివేదికలుగా తయారు చేసి లోకాయుక్త కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నతి ఏపిఎం చినరాయుడు, ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ బాబు, ఏసి దానం, స్థానిక ఎపిఎం పాల్గొన్నారు.

అవినీతిపై విచారిస్తున్న రాష్ట్ర ఉన్నతి అధికారులు

జిల్లా పోటీలకు కురుకుంద విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జిఎఫ్ శ్రీశైల నియోజకవర్గం పోటీలలో కురుకుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు వాలీబాల్, త్రోబాల్, బ్యాట్మెంటన్ వివిధ క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ పోటీల్లో మొదటి స్థానాన్ని క్రైస్తవం చేసుకొని ప్రశంస పత్రాలతో మెడల్స్‌ని సాధించారని తెలిపారు. క్రీడలు ఆడటంలో స్నేహభావంతో కలిగి ఉండాలని, పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచు కోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చెన్నమ్మ, ఉపాధ్యాయులు రవి, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయులు

మహాధర్నా జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

దళితుల రక్షణ కోసం ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.కర్ణ ఆధ్వర్యంలో బుధవారం జూపాడుబంగ్లా మండలం పారమంచాలలో పోస్టర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతం, కులాల పేరుతో విభజించి దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాచారాలను ప్రోత్సహిస్తోందని అన్నారు. వాటికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం దళితులపై జరిగిన సంఘటనలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షలు వేయకుండా స్టేషన్ బెల్ ఇచ్చి సరి పెట్టుకుంటుందని అన్నారు. దళితుల హక్కులను పోరాడి సాధించుకోవడానికి ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు, స్మశాన కార్మికులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ చట్టం అమలు, అసైన్డ్‌మెంట్ భూ సేకరణ చట్టం అమలు కోసం ఈనెల 29న విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్య వ్యవసాయ కార్మికులను కోరారు. స్థానికవ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో సంఘం పట్టణ కార్యదర్శి ఎన్.హైమావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఈరాయిపల్లె అర్జున్, కమిటీ సభ్యులు దూదేకుల దస్త గిరిమ్మ, కె.సుభద్రమ్మ, ఎం.శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వ్యకాసం నాయకులు

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ నెల 18న సంప్రదాయబద్ధంగా ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రతి రోజు రత్నగర్భ గణపతికి, సాక్షి గణపతికి, మృత్తిక గణపతికి, పంచలోహ వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిదవ రోజు ఉదయం యాగశాలలో జరిగిన కార్యక్రమంలో నారికేళంలు, సుగంధ ద్రవ్యాలు, నూతన వస్త్రాలు, ముత్యం, పగడం, వంటివి హోమగుండంలో సంప్రదాయ పద్ధతిలో ఇఒ పెద్దిరాజు దంపతులు పాల్గొని వేద పండితులు వేద మంత్రాల మధ్య సమర్పించారు. సాక్షి గణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన మృత్తిక గణపతికి నిమజ్జనం చేశారు.

భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి

రహదారుల ఏర్పాటుకు కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధితోపాటు రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తవిసికొండ గ్రామంలో రూ. 7 లక్షలతో గ్రామం నుండి రైతుల పొలాల రహదారి నిర్మాణానికి ఎంపిపి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో మండలంలోని ప్రతి గ్రామంలో రైతుల పొలాలకు రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, స్థానిక నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, గోరుమానుకొండ సర్పంచి కోడె వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, బీరేలి నాగేశ్వర్ రెడ్డి, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి : పిఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చదువులో రాణించాలని ఐటిడిఎ పిఒ బి.రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సుండిపెంటలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)ను ఆయన సందర్శించారు. వారం రోజుల క్రితం నలుగురు విద్యార్థులు పాఠశాల నుండి చెప్పకుండా వెళ్లిపోవడంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం నలుగురు విద్యార్థులు పాఠశాలలో లేరనే విషయం ఆలస్యంగా తెలిసిందని, ఈ విషయంపై సంబంధిత ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేశామన్నారు. ఎట్టకేలకు పారిపోయిన విద్యార్థులు గుంటూరులో ఉన్నట్లు సమాచారం వచ్చిందని, పాఠశాలకు తిరుగు ప్రయాణం అయినట్లు చెప్పారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటినుండి ఎప్పటికప్పుడు పాఠశాలను మానిటరింగ్ చేస్తామని, విద్యార్థులను క్రమశిక్షణతో మెలగాలని, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రవీంద్రా రెడ్డి

మాట్లాడుతున్న అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు : వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడగట్టిన నీటిని తాగాలని సూపర్వైజర్ ఆనందమ్మ, మద్దయ్య, సిహెచ్ఓ అన్నమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జునలు ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని రుద్రవరం, వెంపెంట, మద్దూర్ గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామస్తులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో బిపి, షుగరు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, హెచ్ బి పరీక్షలు, గల్ల నమూనాలు సేకరణ చేశారు. అనంతరం గ్రామస్తులకు క్షయ వ్యాధిపై టిబి సూపర్వైజర్ రవికుమార్ అవగాహన కల్పించారు. వేంపెంట, మద్దూర్, తుమ్మలూరు గ్రామంలో ఇంటింటి సర్వేను సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మమత, రేణుక,హెల్త్ అసిస్టెంట్ దొరకమ్మ, రవణమ్మ, ఆశావర్క,హెచ్.ఎం కుమారి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించాలని బండి ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ భావన తెలిపారు. బుధవారం మండలంలోని ఈ కోడూరు గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** గ్రామాలలోని ప్రజలు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు వెళ్లి వైద్య సేవలు పొందాలని ఎంపిడిఓ శోభారాణి తెలిపారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వివిధ రకాలైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఆరోగ్య సేవలన్నీ అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు.

30న చలో విజయవాడ

జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టిన ఛలో విద్యార్థి-చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్కా కుమార్ కోరారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న ఛలో కలెక్టరేట్ లో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఉద్యమాలు చేస్తుండగా పోలీసులు ఎక్కడికక్కడ విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేయడం, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తుండగా అక్రమంగా కేసులు పెట్టారన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులు వేల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశ్విండ్, ఖాజా, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన

- మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన నడుస్తోందని మాజీ రాజ్యసభ సభ్యుడు నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. బుధవారం ఆళ్లగడ్డలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు రాహువు, కేతువుల వ్యవహరిస్తున్నాయని అన్నారు. సిఎం జగన్ రాయలసీమ వాసిగా ఉంటూ సీమకు తీరని ద్రోహం చేస్తున్నారని తెలిపారు. జగన్ మాట తప్పడం దినచర్యగా మారిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అటు కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానిగా గెలిపించుకుందామని, ఇటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వయ కర్త బనగానిపల్లె హుస్సేన్ బాషా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపికి ప్రత్యేక హోదా మీద తొలి సంతకం చేస్తారని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ లాంటి పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షంషుల్ హక్, రుద్రవరం, దొర్నిపాడు మండలాల అధ్యక్షులు శ్రీనివాసులు, చాకలి నాగయ్య, నంద్యాల పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సంజీవ కుమార్, లక్ష్మయ్య, నాగేంద్ర, బాషా, కిషోర్, రాజు, హుస్సేన్ బాషా, శ్రీరామ్, నాగరాజు, నవీన్, నరసింహారెడ్డి, ఉత్తన్న, సుబ్బారాయుడు, అమీర్, హరుణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో తులసి రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి : తులసి రెడ్డి

నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజలకు ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని, రౌడీలు రాజ్య మేలుతున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు ఎన్.తులసి రెడ్డి ధ్వజమెత్తారు. నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు జె. లక్ష్మీ నరసింహ తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అరాచక ఆంధ్రప్రదేశ్ అయ్యిందని, నేరాలకు నిలయంగా మారిందని అన్నారు. జంగిల్ రాజ్ వైసిపి పాలనను పదం పోయిందని రాష్ట్ర ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ల్యాండ్, శాండ్, వైన్, ఎర్రచందనం, ఎర్రమట్టి, సబ్సిడీ బియ్యం మాఫియాలు స్వైర విహారం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి దేశాన్ని అప్పుల భారత్ చేసిందన్నారు. సమావేశంలో టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, అధికార ప్రతినిధి ఊకోటు వాసు, టౌన్ ఉపాధ్యక్షులు ఆనందరావు, సలాం, కో ఆర్డినేటర్ ఎస్ఎండి ఫరూక్, శివారెడ్డి, మైనారిటీ నాయకులు రియాజ్, అహమద్ ఉసేన్, లింగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళా వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన మహిళా వాలంటీర్ పుల్లగూర మౌనిక (30) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శరత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మౌనిక ప్రేమవివాహం చేసుకుని భర్త పుల్లగూర నరేష్, అత్తమామలు చిన్న నరసింహుడు, సుంకమ్మ, కుటుంబ సభ్యులు నరేష్, సంధ్యలు అనుమానం పెంచుకొని మానసికంగా, శారీరకంగా వేధించారు. వారి బాధలు తట్టుకోలేక మౌనిక ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై రుద్రవరం పోలీస్ స్టేషన్ లో మౌనిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మౌనిక (ఫైల్)

రాష్ట్ర పోటీలకు చాగలమర్రి విద్యార్థులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోటయ్య బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్-17లో అమన్, సమీర, అండర్-14లో పండు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు గుంటూరు జిల్లా తెనాలిలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని వివరించారు. అభినందన కార్యక్రమంలో పిఈటి దాదాపీర్, ఉపాధ్యాయులు శాస్త్రీ, శ్రీనివాసులు, రాజశేఖర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, బాబు, మోహన్ రాజు, దేవమణి, పిఈటి భారతి పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-డోన్

విజయవాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని డోన్ మండల నాయకులు డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో యూటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ లు మాట్లాడారు. నాయకులు రవిశేఖర్, సుభాన్, భూకాంత రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఆదినారాయణ, సుబ్బారామయ్య, రఘునాథ్, ప్రసాద్ రావు, రమేష్, రాధ, లీలావతమ్మ, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, ముని రాజు, రాంప్రసాద్, శ్రీనివాసులు,ఎల్లరాజు, లావణ్య, మంజు లావణ్య పాల్గొన్నారు. **ప్యాపిలి :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అక్టోబర్ 1న విజయవాడలోని కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగే స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని ప్యాపిలి మండల అధ్యక్షులు కృష్ణ నాయక్, జిల్లా సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ లు కోరారు. బుధవారం మండలంలోని ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం స్వర్ణోత్సవ గోడ పత్రికలు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రాజ శేఖర్, శివ కుమార్, రోహిణి, భారతి, రుక్మిణి, ఆస్మా బేగం తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో సుండిపెంటలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక పాఠశాలలో ప్రధానాచార్యులు బండ్లమూడి జవహర్ విజేతలైన విద్యార్థులను, పిఇటిలు రాధాకృష్ణ, సుధాకర్, తిమోతిలను అభినందించారు. షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్ లో విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారని తెలిపారు.

జిల్లా పోటీలకు గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల విద్యార్థులు

ఆత్మకూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గం స్థాయి ఆటల పోటీలలో ఎపి గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17లో కబడ్డీ టి. రామాంజ నేయులు, ఖోఖోలో బి.విబేలు, వాలీబాల్ లో ఎస్.అంజి నాయక్, అథ్లెటిక్స్ లో గౌతం నాయక్ తదితరులు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డప్ప అభినందించారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జె.మల్లికార్జున నాయక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పవన్ కళ్యాణ్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు ఎంపిక

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీలలో కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో గౌతం హైస్కూల్ విద్యార్థులు మెరుగైన ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయి ప్రణీత్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులు కుమార్, లింగస్వామి, శివప్రసాద్ రెడ్డి, ముస్తాక్ అహమ్మద్ లను అభినందన సభ నిర్వహించి మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం వెంకటేశ్వర్ రావు, శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీ రాజ రాజేశ్వరి విద్యార్థులు ఎంపిక

గడివేముల : పాణ్యం నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17లో ఎస్.దస్తగిరి, అండర్-14లో ఎస్. వాహిద్ బాషా, 400 మీటర్ల రన్నింగ్ లో సుమోహన్ కుమార్, బాలాజీ నాయక్ లు ఎంపికయ్యారు. హెచ్ఎం ఎం.రామేశ్వర రావు, ఎఒ ఎంఎస్.రాఘవేంద్రరావు, పాఠశాల యాజమాన్యం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

జిల్లా పోటీలకు ఎంపికైన సుండిపెంట గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల విద్యార్థులు

ఆత్మకూరు : జిల్లా పోటీలకు ఎంపికైన గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు

గడివేముల : జిల్లా పోటీలకు ఎంపికైన శ్రీ రాజ రాజేశ్వరి పాఠశాల విద్యార్థులు

అవార్డును అందుకుంటున్న దృశ్యం

పాండురంగాపురంకు పర్యాటక అవార్డు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాండురంగాపురం గ్రామ పంచాయతీకి బెస్ట్ సివిక్స్ మానేజ్మెంట్ ఆఫ్ టూరిస్ట్ డెస్టినేషన్ పురస్కారం దక్కింది. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏపీ టూరిజం శాఖ వారు విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో టూరిజం ఎక్సలెన్స్ అవార్డ్స్-2023 అందించారు. రాష్ట్ర స్థాయిలో నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామ పంచాయతీ బెస్ట్ సివిక్స్ మానేజ్మెంట్ ఆఫ్ టూరిస్ట్ డెస్టినేషన్ పురస్కారాన్ని దక్కించుకుంది. ఈ అవార్డును పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా చేతుల మీదుగా పాండురంగాపురం సర్పంచ్ యర్రబోలు దోలావతి అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి, జెడ్పిటిసి డి.మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆర్.అంకన్న, డి.రాధ, గ్రామ పెద్దలు వై.ఉమా మహేశ్వర్ రెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వీసులపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, యూనిట్ హెడ్ ధనలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో స్కిల్ హబ్ లో భాగంగా డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఆపైన చదివిన 18 నుండి 30 సంవత్సరాల లోపు వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9705998056, 8465925341 సంప్రదించాలన్నారు

టిడిపి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - మహానంది

రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అధ్యక్షతన టిడిపి మండల స్థాయి సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జీలు, క్లస్టర్లకు మహానంది, టిడిపి పాలనలో ప్రజలకు జరిగిన మంచిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అభివృద్ధి, సంక్షేమంతో భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోను వివరించేవిధంగా వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బుడ్డ రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు ఉల్లి మధు, మహానంది ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ పాణ్యం ప్రసాదరావు, మండల నాయకులు క్రాంతి యాదవ్, ఆర్ఎస్ గాజులపల్లె సర్పంచ్ అన్నం భాష, కాకర్ల శివ, శీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

- ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్న బిసి రామనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని క్రిష్ణగిరి సమీపంలో మోటార్ సైకిలును ఆటో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బనగానపల్లె పట్టణంలోని తెలుగు పేటకు చెందిన జక్కు శ్రీనివాసులు, సావిత్రి, విష్ణులు మద్దిలేటి స్వామి తాళ్ల వద్ద బైక్ పై వస్తుండగా గురుదెలియని ఆటో ఢీ కొట్టింది. జక్కు శ్రీనివాసులు, సావిత్రి తీవ్ర గాయాల కాగా, విష్ణు అనే బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో బిసి రామనాథరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అదే రహదారిలో బెంగళూరు నుంచి బనగానపల్లెకు తిరిగి వస్తుండగా ప్రమాద సంఘటనను గమనించి కారు నిలిపెట్టారు. బిసి రామనాథరెడ్డి కుమార్తె డాక్టర్ మౌనిక రెడ్డి వెంటనే క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. బిసి రామనాథరెడ్డి వెంటనే అంబులెన్స్ కు ఫోన్ చేసి క్షతగాత్రులను హుటాహుటిన బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బిసి రామనాథరెడ్డి తో పాటు సతీమణి బిసి మహేశ్వరమ్మ, కుమార్తె డాక్టర్ మౌనిక రెడ్డి క్షతగాత్రులకు సేవలు అందించి బనగానపల్లె ఆసుపత్రి చేరేవరకు వారి వెంటే ఉన్నారు. ప్రమాద సంఘటన గురించి తెలిసిన వెంటనే బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు బిసి జనార్ధన్ రెండు ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

రుద్రవరం మండలంలో వినూత్న పంటల సాగు

- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాల సాగుపై రైతులు దృష్టి

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలో రైతులు వినూత్న పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకు పెరుగుతున్న మార్పులకు అనుగుణంగా రైతులు కొత్త పద్ధతులతో పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేస్తున్నారు. రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం, టి.కొట్టాల గ్రామాల పొలిమేరలలో కేవలం రూ. 8 వేల నుంచి రూ.10 వేల పెట్టుబడితో సుమారు క్వింటా రూ. 8 వేల పలికే జాజు పంటను సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు బాలా గంగాధర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ వాతావరణం లో వచ్చే మార్పుల కారణంగా పంటలు సాగు చేస్తున్నప్పటికీ తెగుళ్ళు, వైరస్ కారణంగా పంట సాగు చేసిన పంటలు సరైన దిగుబడులు రాక పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. దీంతో పెట్టుబడుల కోసం తీసుకువచ్చిన రుణాలు అప్పులుగా మిగిలిపోతున్నాయని చెప్పారు. వాతావరణం మార్పులకు అనుగుణంగా వర్షాభావంలో సాగు చేసే ఈ పంట మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. పంటకు పంటను పశ్చిమబెంగాల్ కు ఎగుమతి చేస్తున్నారని, ఈ పంట ద్వారా వచ్చే విత్తనాలు గోనె సంచులు, నేల మందుల తయారీకి ఉపయోగిస్తారని చెప్పారు. మంచి గిట్టుబాటు ధర ఉన్న ఈ పంటను రైతులు సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఆశాజనకంగా ఉన్న రైతులు సాగు చేసిన జాజు పంట

ఘనంగా మంత్రి బుగ్గన పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - డోన్

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను డోన్ పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్ లో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ డోన్ పట్టణ ప్రజలకు మంత్రి బుగ్గన పుట్టినరోజు సందర్భంగా కేంద్రీయ విద్యాలయాన్ని బహుమతిగా ఏర్పాటు చేశారన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో డోన్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అనంతరం సాయి ఫంక్షన్ హాల్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** రాష్ట్రంలో పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతోనే మళ్లీ రాష్ట్రంలో జగనన్న పాలన రాబోతుందని ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బోరా మల్లికార్జున రెడ్డి, జంగం చంద్రయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ కార్యకర్తలకు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ డోన్ లో కేంద్రీయ విద్యాలయం రావడం శుభ పరిణామమని అన్నారు. డోన్ నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి, రెసిడెన్షియల్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గొరకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికి శుద్ధజల నీరు, వెడల్పైన రోడ్లు, పార్కులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత బుగ్గనకు దక్కుతుందన్నారు. డోన్ నియోజకవర్గంలో 2024లో మళ్లీ మూడవసారి మంత్రి బుగ్గన గెలుపొంది మంచి ఉన్నత పదవులను చేపడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణారెడ్డి, బోరెడ్డి రాము, మస్తాన్ ఖాన్, ప్రభాకర్ రెడ్డి, రఘు, శ్రీనాథ్ రెడ్డి, షాషా, సోమశేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, సంజీవ రెడ్డి, రంగస్వామి, రామూర్తి, జాకీర్, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

డోన్ : మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

ప్యాపిలి : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

వ్యక్తిగత కక్షతోనే చంద్రబాబు అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ లో ఎలాంటి ఆధారాలు లేకపోయినా సిఎం జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత కక్షతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయించారని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా 15వ రోజు బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో కూర్చున్న వారికి మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బాబీ చౌదరి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి ఇబ్బందులకు ఎటువంటి ఆధారాలు చూపలేకున్నారు. కేవలం వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆధారాలు ఉంటే నిరూపించాలని వైసిపి ప్రభుత్వానికి, అధికారులకు సవాల్ సవాల్ విసిరారు. వైసిపి గాలికి వచ్చిందని, గాలిలోనే కలిసిపోతుందన్నారు. త్వరలోనే చంద్రబాబు నాయుడు విడుదల అవుతారని అన్నారు. దీక్షలో కూర్చున్న టిడిపి యాదవ సంఘం నాయకులు కటికవానికుంట బాలరాజు యాదవ్, పర్లపాటి నాగార్జున యాదవ్, చెంచుకొలను వెంకట రాముడు యాదవ్, క్రిష్ణగిరి రంగస్వామి యాదవ్, చెర్లో కొత్తూరు తిమ్మరాజు యాదవ్, మంగంపేట కంబగిరి యాదవ్ ప్రసాద్ యాదవ్ ,రామ మద్దిలేటి యాదవ్, మల్లికార్జున యాదవ్ లకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కష్ట నాయక్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు టిప్ టాప్ కలాం లాయర్ నాగేందర్ రెడ్డి, ఖాదర్ బాషా పాల్గొన్నారు. **నందికొట్కూరు :** చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నందికొట్కూరులో 14వ రోజు జూపాడు బంగ్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పాణ్యం :** స్థానిక టిడిపి కార్యాలయంలో బలిజ కాపు సంఘం ఆధ్వర్యంలో 15వ రోజు దీక్షలు చేపట్టారు. దీక్షకు జనసేన కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు, కడప మాజీ ఎమ్మెల్యే చాంద్ బాష, సంద్కొట్టూర్ ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జి గౌరు చరిత రెడ్డి, బలిజ కాపు సంఘం నాయకులు రమణమూర్తి, కొండ జూటూరు నారాయణ, గోరుకల్ సుధాకర్, గోవధం సురేష్ నారాయణ, గడిగరేవుల శ్రీనివాసులు, సుబ్బయ్య, పాణ్యం రాజశేఖర్, మహేష్, సురేంద్ర, కిరణ్, జనసేన నాయకులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా వైసిపి ప్రభుత్వం ఉందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాదులు కంచర్ల గోవింద రెడ్డి, గిరిరాజు, శేషు రెడ్డి, వెంకటేశ్వర్లు, సాధిక్ అహమ్మద్, శివ శంకర్, భాస్కర్, అనీఫ్ రావు, విజయ భాస్కర్ రెడ్డి, లక్ష్మి నారాయణ, రవి కుమార్, రమణయ్య, అంకి రాజు, బతుకయ్య, కృష్ణ మోహన్ రెడ్డి, మహబూబ్ బాషా, చింతలయ్య, షేక్ మాబు, లింగమయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, లింగా రెడ్డి, నాగూర్ ఖాన్, మల్లికార్జున రెడ్డి, కలిముల్లా, రమేష్, లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో మండల నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గూబగుండం సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి, బాచుపల్లి సర్పంచ్ నరసింహా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికుమార్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ప్రసాద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** చంద్రబాబునాయుడు అరెస్టును ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని టిడిపి మండల కన్వీనర్ గుణం ఎల్ల నాగయ్య, పట్టణ కన్వీనర్ షేక్షావలీ చౌదరి కోరారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ బేతంచెర్ల మండలంలోని తాసిల్ పేట, కొటపేట తదితర కాలనీలలో, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి లోడ్ల శేఖర్, మండల అధ్యక్షుడు రాముడు, రాము తిమ్మారెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, రామ నారాయణ, పెద్ద స్వామి రామయ్య చెన్నయ్య, లోకేష్, గౌడ్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీ కానాల అంజి, శ్రీపతి నాగరాజు పాల్గొన్నారు.

బనగానపల్లె : రిలే నిరాహార దీక్షలో కూర్చున్న టిడిపి యాదవ సంఘం నాయకులు

ప్యాపిలి: మోకాళ్లపై కూర్చుని చెవిలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు